# వెలుగు రేఖలు

ఇదంతా ఎందుకు జరుగుతోందో బాబిగాడికి అస్సలు అర్థం కావడంలేదు. ఏడ్చి ఏడ్చి వాడి కళ్లు ఉబ్బిపోయి చిన్నవైపోయాయి.

మూడు రోజుల్నించి వాడి పెద్దమ్మ తిట్టిన తిట్టు తిట్టకుండా తిట్టిపోస్తోంది వాడి అమ్మనీ, అక్కనీ. 'అక్క చేసింది తప్పైతే అక్కనే తిట్టాలి గాని, అమ్మేం చేసిందనీ?' అనుకున్నాడు వాడు.

ఈ మూడు రోజులుగా తిండీ నిద్రా మరిచి పోయి పెరటివైపు మురిక్కాలవ గట్టుమీద ఒక్కలెక్కన కన్నీరు మున్నీరవుతూనే ఉంది సుభద్ర. కూతురు కనపడకుండా పోయినందుకు సగం, తోడికోడలు తిట్టే తిట్లకు సగం చిక్కి శల్యమైంది.

"అసలు నాన్న పోయాకనే రూపం లేకుండా కృంగిపోయింది అమ్మ. ఇప్పుడు మరింత ఒంగిపోయి కట్టెపేడులా ఉంది" - హఠాత్తుగా తండ్రి గుర్తుకొచ్చి భోరుమని ఏడ్చాడు బాబిగాడు. "ఇన్నాళ్ళుగా తమచేత చేయించుకున్న అరువు చాకిరీ అంతా మర్చిపోయారు పెద్దమ్మా, పెద్దనాన్నా" అనుకున్నాడు బాబిగాడు.

"ఛీఛీఛీ, కుక్కల్ని తీసుకొచ్చి సింహాసనం ఎక్కించాను. వాటి బుద్ధినయి చూపించుకున్నై. లోకానికి మొకం చూపించలేకుండా ఉన్నాను. కుదర్దు, ఇంక నా ఇంట్లో కుదర్దు, ఎక్కడికి పోతారో పొండి లేదా కట్టగట్టుకుని గోదాట్లో దూకండి" మొన్న పొద్దున్నే బావగారు వేసిన రంకెలకి పజవజ వణికింది సుభద్ర.

"ఎదవ జాతి, ఎదవ జాతని. ఎక్కడికి పోతాయ్ బుద్ధులు, తల్లి గడ్డి తింటుంటే పిల్లకి పరవాన్నం ఎక్కుద్దా? మొగుళ్ళని మార్చే రకాలు. దానమ్మ ఇద్దర్ని మార్చింది, ఇదెంత మందిని మార్చుద్దో! పెద్దలు జేసిన పెళ్ళైతే ఒకడితోనే కాపరం ఎలగబెట్టాలీ, ఇలాగ లేసెళ్ళిపోతే రైక మార్చినట్టు ఎంతమందినైనా మార్చొచ్చనీ... లం" - పడిమీద పెద్ద కుర్చీలో కూర్చుని మోచేతిదాకా బంగారు గాజులున్న పురచేతిని చీపురులా ఝాడిస్తోంది తోడికోడలు.

ఈ మూడురోజులుగా పలకరించడాని కంటూ పల్లెలోని జనమంతా వచ్చిపోతున్నారు. గడప దాటి లోపలికొచ్చేముందు వాళ్ళ ముఖాల్లో తెచ్చిపెట్టుకున్న జాలినీ, గడపదాటి వెళ్ళేముందు రంగులు మారిన వ్యంగ్యాన్నీ, ఎగతాళినీ బాబీ మౌనంగా గమనిస్తూనే ఉన్నాడు. అడక్కుండానే వాళ్ళందరికీ పెద్దమ్మ చెప్తున్న కథలు వద్దన్నా వాడిచెవిన పడుతూనే ఉన్నాయి-

"అచ్చుతానికి ఉద్యోగమైన ఊళ్ళో ఎదురింట్లో ఉండేవాళ్ళు సుభద్రా, ఆవిడ గారి మొదటి మొగుడూ. అప్పటికే కృష్ణ పుట్టింది. పెళ్ళాం పోయే వగలు నచ్చక ఆ మొగుడు రోజూ తాగొచ్చి తంతూ ఉండేవాడు. ఆ టైంలోఎలా పట్టేసిందో అచ్చుతాన్ని పట్టేసింది. నోరూ వాయి లేని అచ్చుతానిదసలే జాలిగుండె. ఎక్కడో గుళ్ళో పుస్తె కట్టేసి, ఉద్యోగం మానేసి తన సొంతూరికొచ్చేశాడు ఈమెగార్ని తీసుకుని. మొదట్లో కోపగించుకుని తిట్టిపోసినా తర్వాత్తర్వాత దయాగుణం గల పెద్దాయన వాళ్ళని క్షమించేశాడు. ఉన్న పొలమూ పుట్రా చూస్తూ అన్నగారికి వ్యాపారంలో సాయపడుతూ ఈ ఇంట్లోనే ఉండిపోయాడు అచ్చుతం" అంటోంది.

బాబిగాడి ఆలోచన్లు సాగుతూనే ఉన్నాయి.

ఈ ఇంట్లోనే పుట్టడం వల్ల కొంతా, మగబిడ్డలు లేక కొంతా తనంటే ప్రాణమట పెద్దమ్మకీ, పెదనాన్నకీ. వాళ్ల పిల్లలిద్దరికీ పెళ్ళిళ్ళు చేసి పంపించేశాక కృష్ణక్కని వాళ్ళ మూడోపిల్ల అనుకున్నారట.

అలాగైతే పొలంలో మోటారుషాక్ కొట్టి నాన్న పోగానే కృష్ణనీ, తననీ చదువులెందుకు మాన్పించేశారో వాడికెంత ఆలోచించినా అర్థం కాదు. ఏడో తరగతిలో కొచ్చిన కృష్ణని ఆడపిల్ల ఇంతకన్నా ఎక్కువ చదవడం మన ఇంటా వంటా లేదు అని ఓణీ వేయించి ఇంట్లో కూర్చోబెట్టేశారు.

నాన్న పోయిన ఆరునెల్లకి ఫీజు కట్టలేదని కాన్వెంటువాళ్ళు తనని పంపించేశారు. ఏడుపు మొహంతో షాపు దగ్గరకెళ్ళిన తనని చూసి - "అంతంత డబ్బు పోసి చదివి ఎవణ్నుద్ధరించాల్రా! మనకేం తింటానికి లేదా, పంటానికి లేదా? పోతే పోనీ ఎదవ సదువు, హాయిగా ఆడుకో పో!" అన్నాడు పెదనాన్న. ఆ రోజు తనకెంత సంతోషమేసిందో! పెదనాన్న ఎంత మంచోడు!

పుస్తకాల సంచీ విసిరేసి హాయిగా గట్లంట పుట్లంట పరుగులెత్తి ఆడుకున్నాడు.

సాయంకాలం మట్టికొట్టుకుపోయిన యూనిఫాంతో బూట్లు భుజానేసుకుని ఇంటి కొచ్చిన తనని అమ్మ చింతబరికెతో చావగొట్టింది. ఆ రాత్రి అన్నం తినడం మానేసి తనని

గుండెల్లో పొదువుకుని ఏడ్చింది. కృష్ణక్కని బడి మాన్పించిన రోజు కూడా అమ్మ కళ్ళ నీళ్ళు పెట్టుకోవడం తనకి గుర్తుంది కానీ ఇంత హడావుడి చెయ్యలేదు. ఏమైనా అమ్మకి కృష్ణక్కంటేనే ఇష్టం అనుకున్నాడు తను.

నాలుగు రోజులు పోయాక పెదనాన్న తనని షాపు దగ్గరికి తీసుకెళ్తాంటే ఎప్పుడూ పెద్దనాన్న ఎదుటికి రాని అమ్మ తలదించుకుని కొంగు నిండుగా కప్పుకుని ఎదురొచ్చింది. "వాణ్ణి పంచాయతీ బళ్లోనన్నా చదువుకోనివ్వండి" అని ప్రాధేయపడింది.

"నీ మొగుడు సదివి ఉద్ధరించేడుగా, ఇంక ఈడుండిపోయేడు. ఆడ ముండలు ఎదురొచ్చి సలహాలివ్వడం మా ఇంటా వంటా లేదు. మాలక్ష్మీ ఈ సిగ్గుమాలిందాన్ని లోపలకెళ్లమను" - నిప్పులు కక్కేడాయన.

"ఇంక ఆ రంగసాని వేషాలు కట్టిపెట్టి లోపలికి నడవ్వే ముదనష్టపు దానా" అని కేకలేసింది పెద్దమ్మ.

లోలోపలికి ముడుచుకుపోయింది అమ్మ. దుఃఖంతో పొంగిపొర్లుతున్న కళ్లని ఖాళీ చేసుకోడానికి కాబోలు పశువుల పాకవైపు ఒదిగి ఒదిగి నడిచెళ్ళిపోయింది. అమ్మకి ఈ ఇంట్లోపైకి ఏడవడానికి కూడా హక్కు, సమయమూ లేవు. నాన్నపోయినప్పుడు కూడా అమ్మపన్లు చక్కబెడుతూనే ఏడుస్తాండేది.

పన్నెండేళ్ళు మీదికొచ్చాక ఇప్పుడు గాని తనకి అర్థం కాలేదు పెదనాన్న తనని చదువెందుకు మానిపించాడో. షాపులో మిగతా కుర్రాళ్లందరితో బాటు తను వంచిన నడుం ఎత్తకుండా పని చెయ్యాల్సిందే. మిగతా వాళ్లకి అలుపొస్తే సెలవు పెట్టే హక్కు, జీతం రాళ్లందుకునే అధికారం ఉన్నాయి. తనకవేవీ లేవు.

తన యూనిఫాం చొక్కాలన్నీ ఎప్పుడో చిరిగిపోయినై ఇప్పుడు ఓ కొత్త చొక్కా తొడుక్కోవాలంటే సంకురాత్రి రావాల్సిందే. పని కుర్రాళ్లందరితో బాటే ఆ పెద్ద తానులోంచి చింపి ఇచ్చిన చౌకబారు గుడ్డను కుట్టించుకోవాల్సిందే.

బేగ్స్ హేండిల్స్‌కి తగిలించుకుని యూనిఫాంలో పొట్టి పొట్టి సైకిళ్ళమీద నవ్వుకుంటూ తుళ్లుకుంటూ కాన్వెంటుకు పోయే పిల్లల్ని చూస్తే తనకి ఏడుపొస్తుందిప్పుడు.

మొదట్నుంచీ క్రిష్ణక్కది దుడుకు స్వభావమే. అమ్మ ఏడుస్తాంటే "ఎందుకే ఏడుస్తావు చెయ్యదల్చుకున్నదేదో చేసి చూపించాలి గానీ" అనేది.

దాన్ని బడి మాన్పించినప్పుడు వారం రోజులు నానా కంగాళీ చేసింది.

పెదనాన్న బెత్తం విరిగేలా చావబాదడమే గాక, ఇంట్లోంచి కదిల్తే కాళ్లు విరగ్గొడతానన్నాక, అప్పుడాగింది -

అమ్మ పెద్దగా చదువుకోలేదు. ఆమె పుట్టింటి వాళ్లెవరో కూడా అక్కకీ తనకీ తెలీదు. ఏనాడూ బైటికెళ్ళి కాయకష్టం చేసి ఎరగదు. బతికే మార్గం లేకనే, పిల్లల్ని పెంచే మార్గం లేకనే ఈ నరకంలో, ఈ ఆటుపోట్ల మధ్య నలుగుతోంది.

అమ్మ ఎంతందమైందో పెట్టె అడుగునున్న పాత ఆల్బమ్‌లోని ఫోటోలు చూస్తే తెలుస్తుంది. కానీ ఇప్పుడో... చలికాలంలో ఆకులు రాల్చేసిన ఒంటిమావిడి చెట్టులా ఉంది. కృష్ణ చెప్తూ ఉండేది నాన్న తరచుగా తనని బైటికి తీసుకెళ్లినప్పుడు అంటూ వుండే వాడట "ఈ పల్లెటూరికి తీసుకొచ్చి ఇక్కడి పశువుల్లో, పేడలో, వంటింటి పొగలో ముంచేసి పారిజాతం పువ్వులాంటి మీ అమ్మలోని గ్లోరీనంతా నాశనం చేశాను" అని.

అమ్మ అందమంతా క్రిష్ణక్కకొచ్చింది.

చదువు మానేసాక క్రిష్ణక్క గొప్ప పనిమంతురాలైపోయింది. అవసరం అలాంటిది మరి. అమ్మకి కొంత శ్రమ తప్పించడానికి గొడ్డులా చాకిరీ చేసేది అక్క. నాలుగంకణాల ఇంత పెద్ద ఇల్లంతా ఊడ్చి, గొడ్డూ గోదా చాకిరీ చెయ్యడం మాటలు కాదు. పాలిచ్చే గేదెలు ఎప్పుడూ అయిదారైనా ఉంటుంటై, కొద్దోగొప్పో పాలు ఇంట్లో వాడకానికుంచి మిగిలిన పాలన్నీ అమ్మేస్తుంది పెద్దమ్మ.

అలాపాలు కొనడానికొచ్చే పాల సైకిలు పోలయ్యకీ, పెద్దమ్మ పుట్టింటి వైపు వాళ్లకీ బీరకాయ పీచు బంధుత్వమేదో ఉంది. ఈ మధ్యనేపోలయ్య పెళ్లాం చనిపోయింది మూడో బిడ్డను కనలేక. ఆ పోలయ్యగాడికి అక్క నివ్వడానికి అన్ని ఏర్పాట్లూ చేసేసాడు పెదనాన్న. చుట్టలు కాల్చికాల్చి గారపట్టి పోయినపళ్లూ, ఎర్రటి కళ్లూ వాడూను "చూస్తేనే భయమేసేలా ఉన్నాడు కదరా పోలాయి" అందోసారి కృష్ణవాడితో.

ఆ పోలాయిని చేసుకోనని తిక్కపట్టు పట్టింది క్రిష్ణక్క.

"ఇలాంటి రౌడీ మేళాన్నింట్లో పెట్టుకున్నానేంట్రా దేవుడా" అంటూ శోకాల్తీసింది పెద్దమ్మ.

"చూత్తాను, ఈ పెళ్లెలా సేసుకోదో" అని కాండ్రించి ఉమ్మేడు పెదనాన్న.

"చూస్తాను, ఈ పెళ్లెలా చేస్తారో" అంది. అక్కతనతో.

అందరికీ మధ్యలో అమ్మ మిషన్లో చెరుకులాగా నలిగిపోయింది.

పెళ్లి మూడు రోజులుందనగా రాత్రి పడుకున్న క్రిష్ణక్క తెల్లారేసరికి మాయమైంది.

వెనక వీధిలో రాయుడుగారి వాసింటి గదుల్లో ఒకదాన్లో రెహమాన్ మాస్టారుంటారు. ఎలిమెంటరీ బళ్లో మాస్టారాయన, ఇంకా పెళ్లికాలేదు. చిన్న స్టవ్వుమీద వంట చేసుకుని బడికెళ్లేవాడు. రోజూ పొద్దున్నే బాబిగాడు గానీ క్రిష్ణ గానీ ఒకసావు పాలు పట్టుకెళ్లి ఇచ్చే వాళ్లు. నెలకోసారి జీతాలు రాగానే డబ్బులు తెచ్చి పెద్దమ్మకిచ్చేసే వాడాయన. బలే అందమైన మనిషి. ఎంతో నమ్మకమైన మనిషి అనుకునేవాళ్లు క్రిష్ణక్కాను, తనూ ఎన్నోసార్లు.

ఇప్పుడా రెహమాన్ మాస్టారితోనే క్రిష్ణక్క వెళ్లిపోయిందంటున్నారు ఊరంతా.

పెద్దమ్మ భాషలో చెప్పాలంటే 'లేచిపోయిందం'టున్నారు.

ఆ ముందు రోజే పాలిచ్చి వస్తూంటే వెనక్కి పిలిచి "బాబీ! రేపట్నుంచి పది రోజులు సెలవులు. మావూరెళ్తున్నాను, పాలు తేవద్దు" అని చెప్పేడు. ఆయనిలాంటి పని చేస్తాడంటే నేను నమ్మలేకుండా ఉన్నాను, కానీ, ఇప్పుడా రెహమాన్‌గాడు కన్పిస్తే మీదపడి కొరికి చంపెయ్యాల్సి ఉంది.

సూచాయగా ఒక్క మాటైనా అన్నది కాదు క్రిష్ణక్క. ఎవ్వరికీ అనుమానం రాకుండా ఎంత జాగ్రత్తగా మసలుకుంది! తనని చూసి ఏళ్లూ పూళ్లూ గడిచినట్టన్పిస్తోంది. ఎలా వెళ్లగలిగింది వదిలేసి? "తనంటే వాకెంతిష్టమో తనకి తెలీదూ!" అనుకున్నాడు బాబిగాడు.

బాబిగాడి కళ్లలోకి మళ్లీ నీళ్లు చివ్వున చిప్పిల్లుకొచ్చాయి.

అక్క ఏమైపోయిందోనని అమ్మ ఒకటే భయపడుతోంది. అమ్మవెతికి రమ్మంటే ఊళ్లోని నూతులూ గోతులూ అన్నీ వెతికేసాడు.

"పెదనాన్న పెద్దమ్మా, వాళ్ల చుట్టాలూ అందరూ కల్సి అమ్మనీ అక్కనీ తిట్టడం తప్ప ఒక్కళ్లూ వెతకడానికి ఎక్కడికీ వెళ్లలేదు. ఎవ్వర్నీ పంపలేదు. "పోలీసు రిపోర్టు' అని ఎవరో అనబోతే "ఊరుకోండి పరువు తక్కువ, డబ్బులు ఖర్చు" అని కసిరింది పెద్దమ్మ.

"వాళ్ళ పిల్లయితే ఇలాగే వదిలేసుకుంటారా" అని పొగిలి పొగిలి ఏడుస్తోంది అమ్మ.

పిల్లికి చెలగాటం - ఎలక్కి ప్రాణసంకటం అన్పిస్తోంది బాబిగాడికీ, అమ్మకీ.

ఈరోజు జరగాల్సిన పెళ్లి ఆగిపోవడంతో పోలాయి తాలూకు చుట్టాలంతా వచ్చి తిట్టి వెళ్ళిపోయారు.

నాలుగోరోజు నుంచీ బాబిగాడికి షాపుకెళ్లక తప్పలేదు.

అందరూ తనవైపు జాలిగానో, ఎగతాళిగానో ఎలాగో చూస్తున్నట్టన్పిస్తోంది. ఎందుకో తెలీదు వాడికి తలెత్తడానికి సిగ్గుగా అన్పిస్తోంది. ఊర్లో పుట్టాల్సిన పుకార్లన్నీ పుట్టేసి ఒక రగులు రగిలి చల్లగా ఆరిపోయాయి.

మరో అయిదురోజులు అతి భారంగా గడిచిపోయేక ఆ రోజు మధ్యాహ్నం వచ్చిన బస్సులోంచి అతి ఠీవిగా సూట్‌కేసు పట్టుకొని దిగాడు రెహ్మాన్. ఎప్పట్లాగే అందర్నీ నవ్వుతూ పలకరిస్తూ నడుస్తున్నాడు. జనాలంతా గుడ్లు మిటకరించుకొని చూస్తున్నారే తప్ప ఎవ్వరూ ఎదుటికెళ్ళి ఏరా ఎదవా, నీకిదేం పన్రా? అని అడగడం లేదు. షాపులో కౌంటరు ముందు కూర్చున్న పెదనాన్న సొరుగులోని కత్తి తీసి పరుగెత్తుకెళ్ళి వాణ్ణి పొడిచెయ్యరాదూ! ఊహూం ... కులం, పౌరుషం అంటూ రంకెలు వేసిన పెదనాన్న అసలతన్ని చూడనట్టు మొహం తిప్పుకున్నాడు. అక్కనీ అతన్నీ ఎక్కడెక్కడో చూశామని వాగిన పక్కషాపుల వాళ్ళంతా పత్తా లేకుండా పోయారు.

ఈ రోజాయన వస్తాడని తెలిసే కాబోలు రాత్రి పెద్దమ్మా, పెదనాన్నా అలా మాట్లాడుకున్నారు. ఎప్పట్లాగే తిట్ల పురాణం విప్పేరనుకున్నాడు తను.

"దాని బాబెలాగా వర్ణ సంకరం చేసేసాడు. అదేవన్నా మనకడుపున పుట్టిన పిల్లా పరువు తక్కువని మనం పాకులాడ్డానికి"

"నిజం చెప్పుకోవాలంటే ఒక పీడ ఒదిలిందనుకోయ్యా. మన చేతుల్తో పెళ్ళి జేత్తే రేప్పొద్దున్న దానికి పురుళ్ళనీ పుణ్యాలనీ మనసవురాదిలేదీ. ఇంకది సచ్చిందనుకుని ఒదిలేయ్".

షాపు ముందాగి ఎప్పట్లాగానే పెద్దనాన్నని పలకరించాడు రెహ్మాన్. "బావున్నారా రామారావుగారూ".

"బాబీ ఇట్రా" అన్నాడు. తనకి తెలీకుండానే ముందుకు నడిచేడు బాబిగాడు. "ఇవి మా అమ్మ చేసిన స్వీట్లు, ఇటువైపు దొరకవు. అక్కా నువ్వూ తినండి. రేపట్నుంచి మామూలుగా పాలు తెచ్చిపెట్టేం" నవ్వుతూనే వెళ్ళిపోయాడాయన.

బాబిగాడి గుండెలో మిగిలిన ఏ పిసరంత ఆశో పుటుక్కున తెగిపోయింది.

"క్రిష్ణక్క ఏమైపోయింది"

"ఇది విన్నారా, ఆ కుర్రోడెంట ఎళ్ళలేదంట ఇది" అంటోంది పెద్దమ్మ.

అమ్మకి గాయం మళ్ళీ రేగినట్టుంది. సన్నగా ఏడుస్తోంది.

ఆ రాత్రంతా ఆలోచనల్తో బెంగతో అమ్మకీ, వాడికీ కంటిమీదికి కునుకే రాలేదు.

క్రిష్ణక్క ఎంత చురుకైంది! బొంగరంలా గిరగిరా తిరిగింది తిరిగినట్టే ఉండేది. క్రిష్ణక్కతో బాటే ఈ ఇంటికి కొత్త కళ వచ్చిందనే వాళ్ళంతా. ఇప్పుడు కళ తప్పిపోయి గబ్బిలాలు తిరుగాడే పాడుపడిన కోటలా ఉందీ ఇల్లు.

కోడి కూతతో ఉలిక్కిపడి లేచి కూచున్నారు అమ్మా, బాబిగాడూ.

ఏదో స్ఫురించినట్టు అమ్మ లేచెళ్ళి పెద్ద గేదె ముందుకాస్త పచ్చిక పడేసి పాలు పిండుతోంది. తెల్లని పాల ధారల్ని చూస్తూ తిన్నెమీద ముణగదీసుకు కూర్చున్న వాడికీ ఏదో తోచినట్టై -

గబగబా పళ్ళు తోముకొని ముఖం మీద ఇన్ని నీళ్ళు జల్లుకున్నాడు.

రాత్రి తోమి బోర్లించిన క్యాన్‌లో అమ్మ మాస్టారి పాలు పోసిచ్చింది. బాబిగాడు వడివడిగా అడుగులేసుకుంటూ మాస్టారి ఇల్లు చేరేసరికి ఆయన ఉదయపునడకకి కాబోలు వీధిలోకొచ్చి బైట తాళం వెయ్యబోతున్నాడు. వాడిని చూసి ఆగి పాలకేన్ లోపల పెట్టుకొని వచ్చాడు. అక్కడే నిలబడిన వాడి భుజం మీద చెయ్యివేసి నడిపిస్తూ "ఈరోజు ఇంత చీకట్నే లేచావేం బాబీ" అనడిగాడు.

వాడు సమాధానం చెప్పలేదు. ఆయన సమాధానం ఆశించనూలేదు. పొలం పనుల రోజులు కాక ఊరంతా సద్దుమణిగి ఉంది. ఊరి బైటికి బహిర్భూమికి వెళ్ళి వస్తున్న వాళ్ళు ఒకరిద్దరు ఎదురుపడ్డారు.

ఊరుదాటాక మాస్టారు వాడిని దగ్గరికి పొదువుకుంటూ "బాబీ ఈ పదిరోజుల్లో చాలా చిక్కిపోయావు" అన్నాడు.

ఆ పలకరింతకి వాడిలో ఎక్కడేం కదిలిందో దుఃఖం వెల్లువైపొంగింది. మాస్టారి నడుమును వాటేసుకొని బావురుమన్నాడు.

"మాస్టారూ... మా అక్క ... మా అక్క..." ఎక్కిళ్ళ మధ్య మాట పెగిలి రాక యుద్ధం చేస్తుండగా -

"మీ అక్కకేం కాలేదు, హాయిగా ఉంది"

దిగ్గున తలెత్తి ఆయన ముఖంలోకి చూశాడు.

తూర్పుకొండల మధ్య నుంచి తొలి వెలుగురేఖ అప్పుడే వచ్చి ఆయన కళ్ళల్లో ప్రతిఫలించింది -

"నిజం బాబీ, క్రిష్ణ ఇక్కడికి చాలా దూరంగా ఉన్న సిటీలో మంచి స్కూల్లో జాయినైంది. తన కాళ్ళమీద తను నిలబడ్డాక నిన్నూ, మీ అమ్మగార్నీ తీసుకెళ్తుంది".

"ఒక్కమాట...ఒక్కమాట అమ్మతో చెప్పి వెళ్ళచ్చుకదా" బాబీ ఏడుస్తున్నాడు ఆనందంతో.

"చెప్పి ఉంటే లోకం తెలీని పదిహేనేళ్ళ అమ్మాయిని నమ్మి నా వెంట పంపించి ఉండేవారేనా? ముఖ్యంగా క్రిష్ణకి ఇష్టంలేని ఆ పెళ్ళిని తప్పించాలనీ ... మీకు జరుగుతున్న

అన్యాయానికి ఆనకట్ట వెయ్యాలనీ క్రిష్ణ అడగగానే నేనీ పనికి ఒప్పుకున్నాను. ఇకపైన నువ్వు తీరిక దొరికినప్పుడల్లా నా దగ్గరికి వచ్చి చదువుకుంటూ ఉండాలి. వచ్చే సంవత్సరం నీచేత మెట్రిక్ రాయిస్తాను".

నమ్మలేనట్టు చూస్తున్నాడు బాబీ.

"చదువుకోవాలంటే డబ్బు కావద్దూ".

"డబ్బెందుకు, నీకు నేను ఊరికే చెప్తాగా".

"నాక్కాదు, అక్కకి. సిటీలో .... మంచి స్కూల్లో...".

"అదంతా నీకెందుకు, చిన్నవాడివి. సరే, నీ తృప్తికోసం చెప్తా. నేను చదివిస్తున్నాను. సరేనా?"

"మీరెందుకు చదివిస్తారూ...?" వాడి చిన్న కళ్ళల్లో అనుమానం.

రెహ్మాన్ కొంటెగా నవ్వాడు. "మీ అక్క చదువైపోయాక మేమిద్దరం పెళ్ళి చేసుకుంటాంగా, అందుకు".

నీరెండకి అతని ఎర్రని ముఖం మరింత రాగరంజితమైంది. అతని తెల్లని పలువరస మల్లెమొగ్గల్లా అనిపించాయి.

గబగబా కళ్ళు తుడిచేసుకున్నాడు బాబీ. వాడి ముఖంలో ఆనందం తాండవిస్తోంది.. ఆ ఆనందానికి వాడి గొంతు మూగబోయింది.

చటుక్కున మాస్టారి చేతుల్ని పట్టుకొని కళ్ళకానించుకున్నాడు.

ఈ పదిరోజుల అనుభవాలూ ఆ కుర్రాణ్ణి పదేళ్ళు ముందుకు నడిపించాయి. "మీరు చాలా దయగలవారు మాస్టారూ..." **అన్నాడు** తడబడుతూ.

"ఇది దయాకాదు, జాలీ కాదు, సాంఘిక న్యాయం. ఉజ్వల భవిష్యత్తు కేవలం కులమతాల నంటిపెట్టుకునే ఉండదని తెలియజెప్పే ప్రయత్నం మాత్రమే.

బాబీకి ఆ మాటల అర్థం బోధపడలేదు. అయినా హుషారుగా నవ్వేస్తూ -

"ఇంటికెళ్తున్నాను మాస్టారూ, మా అమ్మకు చెప్పాలి. నేను పెద్దయ్యాక మీ అప్పు తీర్చేస్తానేం" - వెనక్కి తిరిగి పరుగులంకించుకున్నాడు.

*మహిళ, ఆంధ్రప్రభ అనుబంధం, 7-11-1996*

కథా నిలయం
శ్రీకాకుళం